వేములవాడ టౌన్: ఉజ్వల స్కూల్‌లో గోపిక, కృష్ణుడి వేషధారణలో చిన్నారులు

వేములవాడ టౌన్: స్వామివారి మహా మండపంలో ఈవో, అర్చకులతో కలిసి ఉట్టి కొడుతున్న చిన్నారి

రుద్రంగి: మండలకేంద్రంలో ఉట్టి కొడుతున్న యువకులు

# ముకుందా..ముకుందా

- ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు
- ఉట్టికొట్టేందుకు పోటీపడ్డ చిన్నారులు, యువత
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

జిల్లా వ్యాప్తంగా సోమవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సంప్రదాయ దుస్తులు ధరించి కృష్ణుడు, గోపికల వేషధారణలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. ఉట్టి కొట్టేందుకు చిన్నారులు, యువకులు పోటీపడుతూ సందడి చేశారు. కనుల పండువగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాలల్లో చిన్నారుల కోలాట ప్రదర్శనలు అలరించాయి.

*- రాజన్న సిరిసిల్ల నెట్‌వర్క్, ఆగస్టు 26*

చందుర్తి: కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న మల్యాల గ్రామస్తులు, చిన్నారులు

గంభీరావుపేట: ఆక్స్ ఫర్డ్ పాఠశాలలోని నిర్వహించిన శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

సిరిసిల్ల రూరల్: తంగళ్లపల్లిలోని శుభోదయ పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు

వీర్నపల్లి: మండల కేంద్రంలో కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

# పోటెత్తిన భక్తజనం

- భక్తులతో కిటకిటలాడిన రాజన్న ఆలయం
- 75వేలకు పైగా మంది రాక
- సమకూరిన ₹35లక్షలకు పైగా ఆదాయం

స్వామివారి దర్శనం కోసం క్యూలో నిలబడ్డ భక్తులు

వేములవాడ టౌన్, ఆగస్టు 26: శ్రావణ మాస సోమవారం సందర్భంగా వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయం పోటెత్తింది. ఆదివారం రాత్రి నుంచే భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. వేకువజాము నుంచే భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి, రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకున్నారు. తర్వాత క్యూలో గంటల తరబడి వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. కోడెమొక్కు కోసం మూడు గంటలు, స్వామివారి దర్శనం కోసం మరో మూడు గంటలు పట్టిందని భక్తులు పేర్కొన్నారు. రాజన్నను దాదాపు 75వేలకు పైగా భక్తులు దర్శించుకోగా, రాజన్నకు సుమారు ₹35లక్షలకు పైగా ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు వెల్లడించారు. అనుబంధ దేవాలయాల్లో కూడా భక్తుల రద్దీ నెలకొన్నది.

### కనులపండువగా డోలోత్సవం

శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా సోమవారం రాత్రి రాజన్న ఆలయ అద్దాల మండపంలో డోలోత్సవ కార్యక్రమాన్ని ప్రధాన అర్చకుడు నమిలకొండ ఉమేశ్ ఆధ్వర్యంలో కనులపండువగా నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామివారికి అభిషేక పూజలు చేశారు. అనుబంధ దేవాలయమైన శ్రీ అనంత పద్మనాభ స్వామి, సీతారామచంద్రస్వామి, శ్రీ వేణుగోపాలస్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ఆలయ అద్దాలమండపంలో డోలోత్సవ కార్యక్రమాన్ని కనులపండువగా జరిపించారు. రాత్రి 8గంటలకు స్వామివారి మహా మండపంలో అర్చకులు, అధికారులు ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించగా, ఈవో వినోద్‌రెడ్డి, ఏఈవో శ్రీనివాస్ హాజరయ్యారు.

### రాజన్నకు గిరి ఆవు బహూకరణ

వేములవాడ పట్టణానికి చెందిన కూరగాయల కొమురయ్య కూతురు కవిత-అల్లుడు తిరుపతి లండన్‌లో స్థిరపడ్డారు. ఈ క్రమంలో సోమవారం వారు వేములవాడ రాజన్నను కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. గిరి ఆవు దూడకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆలయ అధికారులకు అందజేశారు. వీరి వెంట వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేశ్, నాయకులు చిలుక రమేశ్, సగ్గు దేవరాజు, కూరగాయల శ్రీధర్, తదితరులు ఉన్నారు.

### బ్రేక్ దర్శనం క్యూలైన్ల పరిశీలన

రాజన్న ఆలయంలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బ్రేక్ దర్శన క్యూలైన్లను ఆలయ ఈవో వినోద్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. క్యూలైన్లలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా.. అని భక్తులను అడిగి తెలుసుకున్నారు. స్వామివారిని దర్శించుకుని బయటకు వచ్చే దారి ఉండవద్దని సూచించారు.

గిరి ఆవుదూడకు పూజలు చేస్తున్న భక్తులు

ఆలయంలో డోలోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

### అంతర్గత బదిలీలు

వేములవాడ టౌన్, ఆగస్టు 26: రాజన్న ఆలయంలో ఇటీవల జరిగిన ఏసీబీ తనిఖీల అనంతరం పరిపాలన సౌలభ్యం కోసం 20 మంది అధికారులు, సిబ్బందికి ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆదివారం రాత్రి ఆలయంలో అంతర్గత బదిలీలు చేశారు. పలు శాఖల అధికారులపై ఆరోపణలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈవో తెలిపారు. ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్య లు తీసుకోవాల్సి వస్తుందని, భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

PLOT FOR SALE

★కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి, అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.
NT- 326217

CHANGE OF NAME
★I, MOHAMMED MAHABOOB ALI, R/o. H.No. 3-65, Rudraram, Vemulavada, Rajanna Sircilla-505 402, TS, have Changed My Name to MAHABOB ALI.
NT-336769

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

## అన్నపై కత్తితో దాడి

వేములవాడ రూరల్, ఆగస్టు 26: డబ్బుల విషయంలో అన్నపై కత్తితో తమ్ముడు దాడి చేసిన ఘటన వేములవాడ రూరల్ మండలం నమిలిగుండుపల్లిలో సోమవారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. నమిలిగుండుపల్లికి చెందిన చెరుకు మహేందర్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి అన్నదమ్ములు. తమ్ముడు శ్రీకాంత్‌రెడ్డి కొన్నేండ్ల క్రితం దుబాయి వెళ్లి ఇటీవల వచ్చాడు. ఈ క్రమంలో తాను పంపించిన డబ్బులు ఏమయ్యాయి అని అన్న మహేందర్‌రెడ్డిని శ్రీకాంత్‌రెడ్డి అడిగాడు. ఈ విషయంలో తల్లిపై మహేందర్ దాడి చేయడంతో ఆగ్రహానికి గురైన శ్రీకాంత్ రెడ్డి అన్నపై కత్తితో దాడి చేయడంతో స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు వేములవాడ రూరల్ ఎస్ఐ మారుతి తెలిపారు.

## రైతుల సహకారం మరువలేనిది

ఏవో వెంకట్రావమ్మ దంపతులకు జ్ఞాపిక అందిస్తున్న ఫర్టిలైజర్ యూనియన్ సభ్యులు

కోనరావుపేట, ఆగస్టు 26: మండలంలో 12ఏండ్లుగా విధులు నిర్వర్తించడం అదృష్టంగా భావిస్తున్నానని, ఇందుకు రైతులు సహకరించిన తీరు మరువలేనిదని బదిలీపై వెళ్తున్న ఏవో వెంకట్రావమ్మ పేర్కొన్నారు. ఇటీవల సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలానికి ఏవో బదిలీ కాగా, నిజామాబాద్ గ్రామ రైతు వేదికలో మండల పెస్టిసైడ్, ఫర్టిలైజర్స్, డీలర్స్ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏవో దంపతులను వారు సన్మానించి, జ్ఞాపిక అందించారు. ఇక్కడ మండల పెస్టిసైడ్, ఫర్టిలైజర్స్, డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవదాస్, ఏఈవోలు ఉన్నారు.

## ఉద్యోగ భద్రత కల్పించాలని విప్‌కు వినతి

వేములవాడ, ఆగస్టు 26: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ భద్రత కల్పించి, తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు సమగ్రశిక్షా జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యుల సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 15ఏండ్లుగా చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నామని, తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఇక్కడ జిల్లా సీఆర్పీల సంఘం అధ్యక్షుడు దేవేందర్, ప్రధాన కార్యదర్శి ఉపేందర్, ఉపాధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, సభ్యులు మల్లేశం, వెంకటస్వామి, చందన్, లక్ష్మీపతి, రవి, రవికిరణ్, దేవరాజు, వినయ్, రాజేశ్వరావు ఉన్నారు.

విప్ ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

## రాజన్న చెంత నిద్రచేసి..అనంతలోకాలకు

- అనారోగ్యంతో వృద్ధురాలి మృతి

వేములవాడ టౌన్, ఆగస్టు 26: రాజన్న ఆలయానికి వచ్చిన ఓ మహిళా భక్తులు ఇక్కడే నిద్ర చేసి.. మరుసటి రోజు అనారోగ్యంతో మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. సికింద్రాబాద్‌లోని పాటిగడ్డకు చెందిన వంగపల్లి లక్ష్మి(79) శనివారం కుటుంబసభ్యులతో కలిసి వేములవాడకు వచ్చి.. స్వామివారిని దర్శించుకున్నది. రాజన్న చెంత తనకు నిద్రమొక్కు ఉందని.. ఇక్కడే ఒక రోజు ఉండి నిద్రచేసి వస్తానని వారికి చెప్పింది. ఈ క్రమంలో మరుసటి రోజు ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందింది. లక్ష్మి ఆధార్‌కార్డు ద్వారా వారి కుటుం బసభ్యులకు సమాచారం అందించగా, సోమవారం వారు వచ్చి తీసుకెళ్లారని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వరి నర్సయ్య తెలిపారు.

## నేడు హనుమాన్ చాలీసా పారాయణం

వేములవాడ టౌన్, ఆగస్టు 26: రాజన్న అనుబంధ దేవాలయమైన శ్రీ భీమేశ్వరాలయంలో ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నేటి మంగళవారం 50వ వారానికి చేరుకున్నది. ఈ సందర్భంగా 51వ సామూహిక పారాయణాన్ని నిర్వహిస్తున్నట్లు హిందూ ఉత్సవ సమితి సభ్యులు తెలిపారు. సాయంత్రం 4గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని, ప్రజలు, భక్తులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

## కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఎస్సారార్ ప్రాజెక్టు గేట్ల నుంచి ఎల్ఎండీకి వెళ్తున్న జలాలు

ఇల్లంతకుంట, ఆగస్టు 26: అనంతగిరి శివారులోని అన్నపూర్ణ ప్రాజెక్టుకు సోమవారం బహుబలి మోటార్ల ద్వారా 6,440 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసినట్టు ఏఈ సమరసేన తెలిపారు. మిడ్‌మానేరు ప్రాజెక్టు నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా తిప్పాపూర్ పంప్‌హౌస్‌లోకి గోదావరి జలాలు రాగా, బహుబలి మోటార్ల ద్వారా అన్నపూర్ణలోకి ఎత్తిపోస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 1.25 టీఎంసీలు నిల్వ ఉండగా, రంగనాయకసాగర్‌కు గ్రావిటీ కెనాల్ ద్వారా విడుదల చేశారు.

*ఎల్ఎండీకి నీటి విడుదల*

బోయినపల్లి, ఆగస్టు 26: శ్రీ రాజరాజేశ్వర జలాశయం ఐదు గేట్ల ద్వారా సోమవారం దిగువనున్న ఎల్ఎండీ ప్రాజెక్టు నీటిని విడుదల చేసినట్టు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. ఐదు గేట్ల ద్వారా 14,710 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రీ పంప్‌హౌస్ నుంచి వరద కాలువ ద్వారా 11,650 క్యూసెక్‌ల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు అధికారులు చెప్పారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 18.84 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు వారు తెలిపారు.

## వైభవంగా మహాలింగార్చన

భీమేశ్వరాలయంలో దీపాలు వెలిగిస్తున్న అర్చకులు

వేములవాడ టౌన్, ఆగస్టు 26: శ్రావణమాసం సందర్భంగా వేములవాడ రాజన్న అనుబంధ దేవాలయమైన శ్రీ భీమేశ్వరాలయంలో సోమవారం రాత్రి మహా లింగార్చన ఆలయ వేదపండితులు, అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఇక్కడ ఆలయ ప్రధాన అర్చ టకుడు నమిలకొండ ఉమేశ్, వేదపండితుడు గర్శకుర్తి శ్రీధర్, అర్చకులు గోపన్నగారి శివప్రసాద్, రాజు, మామిడిపెల్లి శరత్, అనువంశీక అర్చకులు కార్తీక్, సాయి, ఫణికృష్ణ, రాజేశ్ ఉన్నారు.

## ఫెస్టిసైడ్స్, ఫర్టిలైజర్ అసోసియేషన్ ఎన్నిక

కోనరావుపేట, ఆగస్టు 26: మండల పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్ డీలర్స్ అసోసియేషన్‌ను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాదాసు దేవదాస్, ఉపాధ్యక్షుడిగా బెద్రం శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారిగా సాగర్ల శంకర్, కార్యదర్శిగా తీపిరెడ్డి తిరుపతిరెడ్డి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు.

## బాధిత కుటుంబానికి సాయం

ముస్తాబాద్, ఆగస్టు 26: పోతుగల్‌లో నిరుపేద కటుంబానికి చెందిన ఎండీ రంజాన్ తండ్రి ఇటీవల మృతి చెందాడు. అలాగే రంజాన్ భార్యతోపాటు అతడి తల్లి కూడా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో బాధిత కుటుంబాన్ని రంజాన్ మిత్రులు సోమవారం పరామర్శించి రూ.27,800 అందించారు.

## విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా అధికారి విజయలక్ష్మి

ముస్తాబాద్, ఆగస్టు 26: సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. పోతుగల్ సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మెనూ ప్రకారం భోజనం అందించాలని, హాస్టల్ పరిసరాలను శుభ్రంగా ఉంచి, విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని సిబ్బందిని ఆదేశించారు. భోజనం బాగుంటుందా.. లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్ రికార్డులు, వంటగది, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. రెండు, మూడు రోజుల్లో కార్పెట్ బెడ్‌షీట్స్ అందిస్తామని తెలిపారు. పాగింగ్ మిషన్ వినియోగించి దోమలు దరిచేరకుండా చూడాలన్నారు. ఇక్కడ హాస్టల్ వార్డెన్ శంకర్, సిబ్బంది ఉన్నారు.

## నిధులు మంజూరు చేయాలని వినతి

కోనరావుపేట, ఆగస్టు 26: మంగళ్లపల్లిలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు మంగళపల్లి గ్రామస్తులు సోమవారం వినతిపత్రం అందజేశారు. సుద్దాల ప్రధాన రోడ్డు నుంచి గ్రామం వరకు బీటీ రోడ్డు, పాఠశాలకు ప్రహరీ నిర్మాణం, మూన్నూరు కాపు సంఘ భవన నిర్మాణంతోపాటు పలు అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు విప్ స్పందిస్తూ, బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.30లక్షలు ఎస్టిమేషన్ పంపించినట్లు తెలిపారు. మంగళ్లపల్లిలో సమస్యలు పరిష్కరిస్తానని హామీఇచ్చారు. ప్రధానంగా కిలోమీటర్ బీటీ రోడ్డు నిర్మిస్తానని వెల్లడించారు. ఇక్కడ బాదినేని బాలరాజు, శేఖర్, మల్లేశం, పరశురాములు, మల్లయ్య, లక్ష్మయ్య ఉన్నారు.

## సేవలకు గుర్తింపుపై హర్షం

ముస్తాబాద్, ఆగస్టు 26: మండల కేంద్రానికి చెందిన బాల బ్రహ్మం 30ఏండ్లుగా సామాజిక సేవతోపాటు వైద్యరంగంలో అందిస్తున్న సేవలను గానూ తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్ నిర్వాహకుడు డాక్టర్ మాచవరం గౌరీశంకర్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి రవీంద్రభారతిలో వైద్య సేవారత్న బిరుదుతోపాటు మెమోంటోతో సత్కరించారు. ఇక్కడ సినీ రచయిత, ఆధ్యాత్మిక గురువు దైవాజ్ఞశర్మ, ప్రధాన కార్యదర్శి అద్దంకి నాగేశ్వరరావు, జోగులాంబ ఆలయ ఈవో సురేందర్‌కుమార్, రాఘవేంద్ర సంగీత ఫిటెన్స్ డ్యాన్స్ అకాడమీ చైర్మన్ రఘురాం, తదితరులు ఉన్నారు.

## 'గ్రీవెన్స్ డే'తో సత్వర న్యాయం

- ఎస్పీ అఖిల్‌మహాజన్
- బాధితుల నుంచి అర్జీలు స్వీకరణ

బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

తెలంగాణ చౌక్, ఆగస్టు 26: బాధితులకు సత్వర న్యాయం అందించేవిధంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం ఏర్పాటు చేశామని ఎస్పీ అఖిల్‌మహాజన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో అర్జీదారుల నుంచి 12ఫిర్యాదులు స్వీకరించారు. ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులకు ఫోన్‌చేసి, బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు. భూతగాదాలు, ఆస్తి తగాదాల విషయంలో చట్టప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ సత్వర న్యాయం అందించే విధంగా చూడాలని సూచించారు. గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిషారం అయ్యాయో.. ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ సమర్థవంతంగా సేవలందించాలన్నారు. గ్రీవెన్ డే ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చూస్తామని తెలిపారు.

## పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్
- గణేశ్ మండప నిర్వాహకులతో సమావేశం

కోనరావుపేట: మండల కేంద్రంలోని రైతు వేదికలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

కోనరావుపేట/ఇల్లంతకుంట, ఆగస్టు 26: గణేశ్ నవరాత్రోత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని వేములవాడ రూరల్ సీఐ మాందాడి శ్రీనివాస్ సూచించారు. కోనరావుపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆయా గ్రామాలకు చెందిన వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని వివరించారు. ఇక్కడ ఎస్ఐ శేఖర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

● ఇల్లంతకుంట మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సోమవారం అన్ని గ్రామాలకు చెందిన వినాయక మండపాల నిర్వాహకులతో ఎస్ఐ కదిరె శ్రీకాంత్‌గౌడ్ సమావేశమయ్యారు. గ్రామాల్లో రోడ్లపై మండపాలు ఏర్పాటు చేయవద్దన్నారు. పోలీసుల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.

## సిట్టింగ్ డీజేలను ఉపేక్షించేది లేదు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 26: డీజే నిర్వహణ, సిట్టింగ్ డీజేలను ఉపేక్షించేది లేదని ఎస్ఐ సుధాకర్ తెలిపారు. అంకిరెడ్డిపల్లెలో ఆదివారం రాత్రి సిట్టింగ్ డీజే నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఏఎస్ఐ చంద్రమౌళి, సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లారన్నారు. పెద్ద శబ్దాలతో సౌండ్ సిస్టం పెట్టి డీజేను సీజ్ చేసి, యజమానిపై కేసు నమోదు చేశామని తెలిపారు. అనుమతులు లేకుండా డీజేలు పెడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నియామకం

ముస్తాబాద్, ఆగస్టు 26: రాష్ట్రీయ నాయి మహాసభ నేషనల్ ఆర్గనైజేషన్ సెక్రటరీగా ముస్తాబాద్‌కు చెందిన జనగామ శ్రీనివాస్ ఎన్నిక కావడంపై మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మండల నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శ్రీనివాస్ ఎంపికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## అసిస్టెంట్ హెల్పర్‌కు కరెంట్‌షాక్

- ట్రాన్స్‌ఫార్మర్‌పై పని చేస్తుండగా ప్రమాదం
- త్రుటిలో తప్పిన ప్రమాదం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 26: కోరుట్లపేటలో హెల్పర్, లైన్‌మెన్లు విధుల్లో అలసత్వం వహిస్తున్నందున ప్రత్యేకించి జీపీ నిధులతో అసిస్టెంట్ హెల్పర్‌గా గ్రామానికి చెందిన మోకిన పల్లి దేవరాజును నియమించుకున్నారు. సోమవారం విద్యుత్ లైన్ సమస్య తలెత్తగా, హెల్పర్ రాజు అందుబాటులో లేకపోవడంతో దేవరాజుకు కాల్ చేశారు. సమస్యపై ఆపరేటర్‌కు చెప్పి విద్యుత్ నిలిపివేసి ట్రాన్స్‌ఫార్మర్‌లో సమస్యను సరిచేస్తుండగా ఆకస్మాత్తుగా కరెంట్ పాసైంది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌పై ఉన్న దేవరాజు ఒక్కసారిగా కిందపడిపోయాడు. స్థానికులు వెంటనే మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే విషయం తెలుసుకున్న గ్రామస్తులు సబ్‌స్టేషన్ వద్దకు వెళ్లగా, కార్యాలయంలో ఆపరేటర్ మంత్రి మహేశ్ కల్లు తాగుతూ ఉండడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రెగ్యులర్ హెల్పర్ అందుబాటులో ఉండేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.